క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన దీపిక



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక

హిందూపురం: కలెక్టర్ అరుణ్‌బాబును హిందూపురం వైఎస్సార్‌సీపీ పార్టీ సమన్వయకర్త దీపిక మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. స్పందన సమయంలో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. హిందూపురం అభివృద్ధిపై మళ్లీ గురువారం సాయంత్రం కలిసి కూలంకషంగా చర్చించనున్నట్లు చెప్పారు. ఆమె వెంట వేణురెడ్డి, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, అగ్రీ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, ఆనంద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రమాణ స్వీకారాన్ని విజయవంతం చేయండి

పెనుకొండ: విజయవాడలోని బీసీ కార్పొరేషన్‌లో ఈ నెల 19న జరిగే ప్రమాణ స్వీకారోత్సవంలో వాల్మీకి, బోయలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని వాల్మీకి, బోయ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొగాకు రామచంద్ర తెలిపారు. ప్రమాణ స్వీకారంలో భాగంగా కొడికొండ చెక్‌పోస్టు నుంచి పెనుకొండ వరకు భారీ ర్యాలీ ఉంటుందన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



చెట్టుకొమ్మ విరిగి పడిన దృశ్యం

మడకశిర: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం త్రుటిలో ప్రమాదం తప్పింది. కార్యాలయం ఎదుట ఉన్న రావి చెట్టు కొమ్మ అకస్మాతుగా విరిగింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

తక్కువ ధరకే నిత్యావసరాలు

పెనుకొండ: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం బియ్యం, కందిపప్పు కేంద్రాన్ని సబ్‌కలెక్టర్ కార్తీక్ సోమవారం ప్రారంభించారు. పట్టణంలోని రిటైల్డ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. సోనామసూరి కేజీ రూ. 44, కందిపప్పు రూ.135 విక్రయిస్తున్నట్లు సబ్‌కలెక్టర్ కార్తీక్ తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మడకశిర: పట్టణంలో సోమవారం పౌరసరఫరాలశాఖ, కిరాణ వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను తహసీల్దార్ ముస్తావలి ప్రారంభించారు. వినియోగదారుల ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఎస్‌డీటీ ఆరతి, కిరాణ వర్తక సంఘం ప్రతినిధి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యం అయిన విద్యార్థి గుర్తింపు



షాజహాన్

చిలమత్తూరు: లేపాక్షి గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న షాజహాన్ ఆదివారం సాయంత్రం అదృశ్యం అయ్యాడు. అయితే సోమవారం ఉదయం మండలంలోని కనుమ లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో ఏడుస్తూ ఉండటంతో అటుగా వెళ్లిన ఓ ప్రైవేటు పాఠశాల బస్సు డ్రైవర్ విద్యార్థిని చూసి ఆరా తీసి స్థానిక పోలీసుస్టేషన్‌లో అప్పజెప్పారు. ఎస్ఐ శ్రీనివాసులు బాలుడి తల్లిదండ్రులకు విషయాన్ని చేరవేసి వారికి అప్పజెప్పారు. అయతే గురుకుల పాఠశాలలో విద్యార్థి ఎలా బయటకు వచ్చాడన్నది తేలాల్సి ఉంది. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థులు అదృశ్యం అవుతున్నారన్న విమర్శలున్నాయి.

వర్షం కోసం పాదయాత్ర



శ్రీరామదండు పాదయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

పరిగి: మండలంలోని గొల్లపల్లిలో సోమవారం శ్రీరామదండు పాదయాత్ర చేపట్టారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం నుంచి శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, భరతుడు, శతృఘ్నుడు, ఆంజనేయస్వామి వేషాధారణలతో శ్రీరాముని చిత్రపటాలను చేతబూని బృందాలుగా ఏర్పడి రామకీర్తనలతో, భజనలు చేసుకుంటూ పాదయాత్రను చేపట్టారు. మలుగూరు, రంగపురం, చిన్నగుద్దంపల్లి, పెద్దగుద్దంపల్లి, మణేసముద్రం గ్రామాల్లో యాత్ర పాదయాత్ర చేశారు.సాయంత్రం ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరాముని చిత్రపటాన్ని ఉంచి పూజలు చేశారు.

పోలీసుల అదుపులో జేసీబీ దొంగలు?

పరిగి:మండలంలో ఇటీవల జరిగిన జేసీబీ వాహనం దొంగతనం కేసులో నిందితులు పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది. కర్ణాటక ప్రాంతంలో జేసీబీ వాహనంతో పాటు దొంగలను కూడా పట్టుకున్నట్లు సమాచారం.

కష్టం తెలుసుకుని అండగా...



బెంగళూరులో ఉన్న ద్యావమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ రంజిత (ఫైల్)

రొళ్ల: రాష్ట్ర వ్యాప్తంగా ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ కార్యక్రమం ఓ సంచలనాత్మకమైన విషయమన్నది అందరికీ తెలిసిందే. రొళ్ల సచివాలయం-2 పరిధిలోని హనుమంతనపల్లికి చెందిన ద్యావమ్మ రెండు నెలల క్రితం స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో పింఛన్ పంపిణీ చేయలేకపోయారు. వలంటీర్ రంజిత ఆమె కోసం వివరాల ఆరా తీయగా కంటి ఆపరేషన్ కోసం ద్యావమ్మ బెంగళూరు వెళ్లినట్లు కనుక్కొన్నారు. ద్యావమ్మ ఆర్థిక పరిస్థితి బాలేదని తెలుసుకొని స్వంతం ఖర్చుతో బెంగళూరుకు వెళ్లారు. బంధువుల ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ద్యావమ్మకు పింఛన్ సొమ్ము అందజేశారు.



వలంటీర్ మేలును మరువలేను



గతంలో కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా సకాలంలో పింఛన్ అందేది కాదు. ప్రస్తుతం ప్రతి నెల 1నే పింఛన్ పంపిణీ అందిస్తున్నారు. నేను గ్రామంలో అందుబాటులో లేని విషయాన్ని తెలుసుకుని ఏకంగా బెంగళూరుకు వచ్చి వలంటీర్ రంజిత పింఛన్ ఇవ్వడాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా వలంటీర్‌కు చెప్పుకొంటే వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నారు. మాలాంటి పేదలకు వలంటీర్ వ్యవస్థ ద్వారా ఎంతో మేలు జరుగుతోంది.

– ద్యావమ్మ, వృద్ధురాలు, హెచ్ఎం పల్లి

శభాష్ విష్ణువర్ధన్‌రెడ్డి



బెంగళూరులో అంజినప్పతో ఈ కేవైసీ తీసుకుంటున్న వలంటీర్ విష్ణువర్ధన్‌రెడ్డి (ఫైల్)

చిలమత్తూరు: కరోనా కష్టకాలంలో వలంటీర్లు అందించిన సేవలు అన్నీ ఇన్నీ కావు. ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితుల్లో సంక్షేమ పథకాలు మొదలు కాయగూరలు, నిత్యావసరాలను కూడా వలంటీర్లే ఇళ్ల వద్దకే మోసుకెళ్లారు. 2021లో లాక్‌డౌన్ కారణంగా ఆర్థిక పరిస్థితులు బాగోలేక సొంత గ్రామం చెరువుకిందపల్లికి రాలేక అంజినప్ప అనే లబ్ధిదారుడు బెంగళూరులోనే ఉండిపోయారు. ఈ నేపథ్యంలో గ్రామ వలంటీర్ విష్ణువర్ధన్‌రెడ్డి రేషన్‌కార్డు ఈ కేవైసీ కోసం బెంగళూరుకు తన సొంత ఖర్చులతో వెళ్లి అంజినప్పతో ఈ కెవైసీ చేయించి ఔదార్యాన్ని చాటుకున్నారు.

రేషన్ కార్డు పోయేది



కరోనా లాక్‌డౌన్‌లో రేషన్‌కార్డుకు ఈ కేవైసీ ప్రభుత్వం తప్పనిసరి చేసింది. అప్పటికే రేషన్ పొందక మూడు నెలలైంది. నేను గ్రామానికి వెళ్లేందుకు నా ఆర్థిక పరిస్థితి బాలేదు. దీంతో వలంటీర్ విష్ణుకు ఫోన్ చేసి విషయం చెప్పాను. ఆ బాబు వెంటనే బెంగళూరు వచ్చి నాతో ఈ కేవైసీ చేయించాడు. వలంటీర్ లేకపోతే నా రేషన్ కార్డు పోయేది.

– అంజినప్ప, చెరువుకిందపల్లి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• ఎమ్మెల్యే తిప్పేస్వామి



అమరాపురం: సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

అమరాపురం: రాష్ట్రంలోని ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో అమరాపురం గ్రామ సచివాలయం – 2 పరిధిలోని కోటవీధి, బీసీ, ఎస్సీ కాలనీలోని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ, ఇంటి నిర్మాణం తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఏ ఇంటికీ వెళ్లినా తమకు ప్రభుత్వం నుంచి పథకాలు నేరుగా ఎలాంటి ఇబ్బంది లేకుండా అందుతున్నాయని లబ్ధిదారులు తెలిపారు.

అభివృద్ధిని ఓర్వలేక పోతున్నారు

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. దీన్ని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో రైతులు ఖరీఫ్‌లో పంట సాగు చేయడానికి వేరుశనగ విత్తనకాయ కోసం మండల కేంద్రాలకు రాత్రిళ్లు వచ్చి నిద్రాహారాలు మాని ఉపవాసంతో వేచి ఉండాల్సి వచ్చేదన్నారు. సీఎం జగన్ గ్రామాల్లో ఆర్బీకేలు ఏర్పాటు చేసి ఏ రైతు కష్టపడకూడదని ఆయా గ్రామాల్లోనే వేరుశనగ విత్తనకాయను అందించే ఏర్పాటు చేశారన్నారు. అవినీతికి తావు లేని ప్రభుత్వం మనదన్నారు. ఇలాంటివి చూడలేక చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌కు వణుకు పుట్టిందన్నారు. ఎన్ని యాత్రలు చేసిన వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ నళిని, డైరెక్టర్ లక్ష్మీదేవి, ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు చిక్కన్న, జిల్లా వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ కారుణ్య, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణ, జేకే. మూర్తి, రాజశేఖర్, సురేష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

• వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక

హిందూపురం: పట్టు రైతులు, రీలర్ల సమస్యల పరిష్కారానికి శాయశక్తుల కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్.దీపిక అన్నారు. పట్టు రైతులు, రీలర్ల సమస్యల పరిష్కారానికి సోమవారం పట్టుగూళ్ల మార్కెట్‌లో నిర్వహించిన సమావేశానికి దీపిక ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌లో రీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్సార్, కార్యదర్శి ముస్తఫా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో దీపిక మాట్లాడుతూ చరకా రీలర్లకు కొన్నేళ్లు పెండింగ్‌లో ఉన్న స్థల సమస్య పరిష్కరించేలా త్వరలోనే స్థలాలు అందించడానికి శాయశక్తుల కృషిచేస్తామన్నారు. రెండేళ్ల క్రితం రీలర్ల సమస్యలు ప్రభుత్వానికి తెలియజేయడానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన రియాజ్ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా సాయం అందేలా కృషి చేస్తామన్నారు. పట్టురీలర్లు, రైతులకు ఇన్‌సెటివ్ ఇప్పించడానికి తనవంతు ప్రయత్నం చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి, నియోజకవర్గ నాయకులు వేణురెడ్డి, కౌన్సిలర్ శివ, మారుతీరెడ్డి మాట్లాడుతూ పట్టుగూళ్ల మార్కెట్‌పై ఆధారపడి దాదాపు 500 రీలర్లు, 8 వేల కుటుంబాలు ఆధారపడి ఉన్నాయన్నారు. సీఎం జగన్ , మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పట్టుగూళ్ల రైతులు, రీలర్ల సమస్యను నియోజకవర్గ సమన్వయకర్త దీపిక సమస్యను పరిష్కరిస్తారన్న నమ్మకం తమకుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు ఆసీఫ్‌వుల్లా, నాగేంద్రబాబు, రామచంద్రా, షాజియా పార్వతీ, నాగరాజు, మల్లికార్జున, కార్పొరేషన్ డైరెక్టర్లు నాగమణి, లక్ష్మినారాయణ, ముత్తవల్లి తల్హాఖాన్, వైస్ ఎంపీపీ అంజన్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ నక్కలపల్లి శ్రీరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫైలాన్‌ను వినియోగంలోకి తెస్తాం

పట్టణంలోని రహమత్‌పురం నడిబొడ్డున ఏర్పాటైన వైఎస్సార్ పీఏబీఆర్ ఫైలాన్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకొస్తామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయర్త టీఎస్ దీపిక తెలిపారు. నాయకులు వేణురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌లతో కలసి సోమవారం ఆమె రహమత్‌పురం సర్కిల్‌లో ఫైలాన్‌ను పరిశీలించారు. ఉన్నతాధికారులతో చర్చించి ఫైలాన్ నీటిపై పులకు మరమ్మతు చేయిస్తామని, అతిత్వరలోనే పూర్వవైభవాన్ని తీసుకువస్తామన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రంలో మంగళవారం ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథగుప్తా తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

అమరాపురం: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం – 2 పరిధిలో మంగళవారం ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు.

104 సిబ్బందిపై వేటు

చిలమత్తూరు: మండలంలోని ఇద్దరు 104 ఉద్యోగులపై అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు చిలమత్తూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రామకృష్ణ సోమవారం తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో మదిరేపల్లికి వెళ్లిన 104 డాక్టర్ తేజస్విని అక్కడ సిబ్బందితో కలసి గోలీలు ఆడినట్లుగా వీడియో వైరల్ కావడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టి 104 సిబ్బందిని తొలగించినట్లు సమాచారం.

నాణ్యమైన భోజనం వడ్డించండి

అగళి: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌ను డీవైఈఓ రంగస్వామి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రాగిజావను సక్రమంగా పంపిణీ చేయకపోవడంతో ప్రిన్సిపాల్‌ను మందలించారు. మధ్యాహ్న భోజనంపై కూడా విద్యార్థులు ఫిర్యాదు చేయడంతో ఏజెన్సీ నిర్వాహకులిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యమైన భోజనం వడ్డించంచాలని ఆదేశించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం టౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ) మహిళా గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మురళీమోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్‌లో 50 శాతం ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 19న ఉదయం 11 గంటలకు కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

నూతన బస్సు సర్వీసు ప్రారంభం

రొద్దం: మడకశిర నుంచి రొద్దం మీదుగా పెనుకొండకు సోమవారం ఆర్టీసీ బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు ప్రారంభించారు. మడకశిరలో ఉదయం 8:15 నిముషాలకు ప్రారంభవుతుందన్నారు. తిరిగి సాయంత్రం తిరిగి 4: 30 నిముషాలకు రొద్దం నుంచి బస్సు మడకశిరకు బయలుదేరి వెళ్తుందన్నారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి జయంతి



హిందూపురం: కొటిపి చౌడేశ్వరీదేవి



లేపాక్షి: అలంకరణలో సత్యమ్మ



పరిగి: బాలా చౌడేశ్వరీ ఆలయంలో కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

హిందూపురం/పరిగి/లేపాక్షి: హిందూపురం, పరిగి, లేపాక్షిల్లోని చౌడేశ్వరీదేవి ఆలయాల్లో అమ్మవారి జయంతిని ఘనంగా నిర్వహించారు. పరిగిలో బాలా చౌడేశ్వరి, హిందూపురంలో కొటిపి, ముద్దిరెడ్డిపల్లి చౌడేశ్వరి ఆలయాలు, లేపాక్షి మండలం మామిడిమాకుపల్లి సమీపంలో సత్యమ్మ, చోళసముద్రంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయాల్లో పూజలు జరిగాయి.

నేడు బాలికల అథ్లెటిక్స్ పోటీలు

రొళ్ల: మండల పరిధిలోని దొమ్మరహట్టి దగ్గరున్న బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో మండల స్థాయి బాలికల అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఏటీఎల్ సుబ్బారావు తెలిపారు. మండలస్థాయిలో గెలిచిన వారిని నియోజకవర్గస్థాయి, జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

సంఘాల బలోపేతానికి కృషి

అమరాపురం: గ్రామాల్లో మహిళా సంఘాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీసీ భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వి.అగ్రహారం గ్రామంలో అంజలి గ్రామైక్య సంఘం వార్షికోత్సవ మహాసభ జరిగింది. రుణాలతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సీసీ భాస్కర్ మహిళలకు సూచించారు.

సామాజిక కార్యకర్తకు సన్మానం



సమర్థనం ట్రస్ట్‌లో డాక్టర్ మహంతేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: ప్రముఖ సామాజిక కార్యకర్త, ప్రపంచ అంధుల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మహంతేష్‌ను ఘనంగా సన్మానించారు. సోమవారం గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఆయన గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. దీంతో కొడికొండ చెక్‌పోస్టులోని సమర్థనం ట్రస్ట్‌లో ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో ఎర్రిస్వామి, శంకర్, కవిత, మూర్తి ,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక

పావగడ: తాలూకా వ్యాప్తంగా సోమవారం గ్రామ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు జరిగిన ఎన్నికలు సజావుగా జరిగాయి. సీకే పురం గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా సువర్ణమ్మ రాజప్ప, ఉపాధ్యక్షురాలిగా రాజమ్మ , చిక్కహళ్లి అధ్యక్షురాలిగా మీనాక్షమ్మ అంజయ్య, ఉపాధ్యక్షుడిగా జగదీశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విరుపసముద్ర అధ్యక్షుడిగా సత్యనారాయణ(జేడీఎస్) లాటరీ పద్ధతిలో ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షురాలిగా లలితమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రొప్ప ఎన్నికల్లో అధ్యక్షురాలిగా రూప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కన్నమేడి అధ్యక్షురాలిగా వెంకటలక్ష్మమ్మ, ఉపాధ్యక్షరాలిగా గంగమ్మ, బూదిబెట్ట అధ్యక్షురాలిగా పుష్ప, ఉపాధ్యక్షురాలిగా సణ్ణీరప్ప, కేటిహళ్లి అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షరాలిగా కవిత, సిద్ధాపుర అధ్యక్షురాలిగా గంగోత్రి, ఉపాధ్యక్షుడిగా ఈరప్ప, జే అచ్చమ్మనహళ్లి అధ్యక్షుడిగా పురుషోత్తం, ఉపాధ్యక్షురాలిగా సావిత్రి, నాగలమడక అధ్యక్షుడిగా పురుషోత్తం, ఉపాధ్యక్షురాలిగా సిద్ధగంగమ్మ, ర్యాపిట అధ్యక్షురాలిగా అంజినమ్మ, ఉపాధ్యక్షురాలిగా నీల ఎన్నికయ్యారు.

రేషన్ బియ్యం పట్టివేత

మడకశిర: అక్రమంగా కర్ణాకలకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ఇషాక్‌బాషా తెలిపిన మేరకు.. అందిన ముందస్తు సమాచారంతో మడకశిర–పావగడ మార్గంలో సోమవారం ఉదయం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన లారీని అడ్డుకుని పరిశీలిస్తే 360 బస్తాల రేషన్ బియ్యం బయటపడింది. పావగడ నుంచి మధుగిరికి బియ్యాన్ని తరలిస్తున్నట్లుగా గుర్తించారు. లారీని సీజ్ చేసి రేషన్ బియ్యాన్ని స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేదలకు వరం జగనన్న సురక్ష



హిందూపురం: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి



అగళి: లబ్ధిదారులకు పత్రాలను అందజేస్తున్న తహసీల్దార్ జమానుల్లాఖాన్

హిందూపురం అర్బన్: 'జగనన్న సురక్ష' కార్యక్రమం పేదలకు వరమని వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని గోళ్లాపురం సచివాలయ పరిధిలోని ఈశ్వర ఆలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ రత్నమ్మ, వైస్ ఎంపీపీ కృష్ణవేణి, ఎంపీడీఓ సురేంద్ర, కార్యదర్శి కెంచరాయప్ప, సర్పంచ్ దేవరాజు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పురుషోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగళి: మండల పరిధిలోని ఇనగలురు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. తహసీల్దార్ జమానుల్లాఖాన్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఏఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి అశోక తదితరులు పాల్గొన్నారు.

పరిగి: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో సోమవారం సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాధిక్, సచివాలయ సెక్రెటరీ నజ్మా తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష ఇలా..

రొళ్ల: గుడ్డగుర్కిలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆజాద్ తెలిపారు.

మడకశిరరూరల్: మండలంలోని హారేసముద్రం-01, ఆర్ అనంతపురం సచివాలయాల వద్ద మంగళవారం జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సోనీబాయి, తహసీల్దార్ ముర్షావలి తెలిపారు.

చిలమత్తూరు: నేడు మండలంలోని పలగలపల్లిలో నిర్వహించనున్న "జగనన్న సురక్ష" కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక హాజరవుతారని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి తెలిపారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

రొళ్ల: మండల వ్యాప్తంగా పీఎంఏవై పథకం కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణపు పనులు ప్రారంభించాలని ఏఈ మసప్ప, వర్క్ ఇన్‌స్పెక్టర్ రుద్రప్ప కోరారు. సోమవారం మండలంలోని ఎం.రాయాపురం, హొట్టేబెట్ట, కాకి, రత్నగిరి, రొళ్ల తదితర పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో పర్యటించి ఇళ్ల స్థలాలను పరిశీలించారు.

రొద్దం: వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ ఖాజామైనుద్దీన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ అధికారులు పరిశీలించారు.

నయనానందకరం



హిందూపురం పట్టణ శివారున హిందూపురం – లేపాక్షి రహదారిలో ఉన్న శ్రీకంఠపురం చెరువులో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి. ఇందులో భాగంగానే లక్ష్మీ కమలాలు చెరువంతా కప్పేశాయి. ఆ దారిన పోయేవారంతా ఆ కమలాలను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– హిందూపురం అర్బన్

హత్య కేసు నమోదు

అమరాపురం: మండలంలోని కె.శివరం గ్రామానికి చెందిన దళిత శివలింగప్ప కుమారుడు మహంతేష్‌పై హత్య కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే ఈ నెల 11వ తేదీ కె.శివరం బస్టాండ్ సమీపంలోని ఓ దుకాణం వద్ద సిగరెట్ కాలుస్తున్న మహంతేష్‌ను చూసిన అదే గ్రామానికి చెందిన రంగనాథ్ (17) విషయాన్ని అతని తల్లిదండ్రులకు చెబుతానన్నాడు. ఆ సమయంలో క్షణికావేశానికి లోనైన మహంతేష్... దుకాణంలో ఉన్న పెట్రోల్ తీసుకుని రంగనాథ్‌పై పోసి నిప్పంటించాడు. స్థానికులు స్పందించి మంటలు ఆర్పి తీవ్రంగా గాయపడిన రంగనాథ్‌ను కర్ణాటకలోని శిర ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆస్పత్రికి, అక్కడ వైద్యుల సలహా మేరకు బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో సోమవారం రంగనాథ్ మృతి చెందాడు. మహంతేష్‌పై హత్య కేసు నమోదు చేసినట్లు మడకశిర సీఐ సురేష్‌బాబు తెలిపారు.

జేడీఎస్ సీనియర్ నేత కరియణ్ణ మృతి

పావగడ: స్థానిక సీనియర్ జేడీఎస్ నేత శైలాపురం సీ కరియణ్ణ (62) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల స్థానిక జేడీఎస్ నాయకులు అంజినరెడ్డి, రామప్ప, వెంకటరత్నం శెట్టి, ఎస్ హనుమంతరాయ తదితరులు సంతాపం తెలిపారు.